# ఆరూఢం

[కథానిక]

శ్రీ కందుకూరి లింగరాజు

గదిలో కూర్చుంటే చుట్టూరా వున్న అనేకరకాల పత్రికలు తనకి కోపం తెప్పించేయి. వాటిని విసిరెయ్యాలని, చింపి పారెయ్యాలన్నంత కోపంవస్తోంది. కిటికీలోనుంచి వచ్చే చిన్నగాలి పేజీల్ని త్రిప్పుతోంది. అందులో అనేక రచయితలు పుట్టి, పెరిగి, జరిగిపోతున్నారు. వాళ్ళ పేర్లు తనకి నిత్యతలంపుల్లోని అంశాలుగానే వున్నాయి. తనకి ద్వేషం కల్గిస్తున్నారు. దేశాన్ని ఉద్ధరిద్దామని, వెర్రి మొర్రి కథలువ్రాస్తూ, పేరుపడినందుకు సంతోషించేవారిలాగే కన్పడ్డారు. వాళ్ళు, వాళ్ళ కథలన్నా సుందరికి ఉగ్గుపాలతో వెళ్లుకురావటం ప్రారంభించింది.

తన అత్తగార్ని చూసింది. అవీబైయ్యోళ్ళపడిదాటి, నడుం వంగీ వంగని స్థితిలో వున్న ఆవిడ, ఇంకా ఆ పత్రికలన్నీ సరదాగానే చదువుతుంది. తన రాజా వ్రాసినవన్నీ ఇంకో రెండు మూడు సార్లు చదివి మురిసిపోతుంది. అందులోనే ఆతని జీవ మున్నట్లు, భావి ఆధారపడ్డట్టూను. ఆవిడభర్తకూడా ఓ పెద్ద పత్రికాఆఫీసులోనే పనిచేసి చచ్చిపోయేడు. ఆ చాలీ చాలని జీతంతో సంసారం నెగ్గుకురాలేక పడ్డ కష్టాలు, ఒక్కపేట పలకసర్లు తప్ప ఇంకోటి చేయించలేని బీదతనం, పడ్డ శ్రమ, ఇవన్నీ ఆవిడకు గుర్తువున్నా, ఎందుకు తన కొడుకునికూడా, తండ్రి అడుగుజాడల్లో నడవమని ప్రోత్సహిస్తూందో తెలియటం లేదు. కడుపు మాడ్చుకుని, పోషించుకోలేక, దయా ధర్మబిచ్చంక్రింద వాళ్లు ఇచ్చే స్వల్పప్రతిఫలాల్లోనూ జీవించడం ఎందుకో అర్థంకాలేదు. ఎన్నోసార్లు ముఖాముఖీగా అడుగుదా మనుకునేది. కాని ధైర్యం చాలేదికాదు.

రాజాని చూచినప్పుడల్లా, ఆకళ్లల్లోని ఆశ, పట్టుదల అతనికే ఓ చిన్న ప్రెస్సు ఉంటే, యావదాంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించే పత్రికాసంస్థగా చేసివుండేవాడన్నట్టే తట్టేది. దానికి డబ్బో! అదే లేదు. తన సంపాదనలో ఆతను ఎప్పుడు ఈ ఆశను సఫలీకృతం చేసుకోలేడు. ఆ ఆశలు నిరాశగా తయారవ్వడంతప్ప. ఆ పట్టుదలకోసం, తన్ని ఈ చిన్న అద్దెఇంట్లో, ద్వేషించే పరిసరాల్లో వదలి వారాలు, నెలలుకూడా, ఉండిపోయి విధినుండి తను సఫలీకృతుడు అవుతాడన్నంతగా త్యాగంచేస్తాడన్న భయం పీకేది. అతని తండ్రివలె ఈతడుకూడా, విధిని జయించలేక దానికి బలి అయిపోతాడేమో అన్న భయం శాంతి నిచ్చేది కాదు సుందరికి.

ఆరోజు ఆతను దగ్గరగా వచ్చేడు. దగ్గరగా తీసుకునే "సుందరీ! నా కథలన్నిటికీ జీవంపోసిన దేవకన్యవా నువ్వు" అన్నాడు. అన్నాళ్లల్లోనూ చూచింది. ప్రతికథలోనూ తనపేరు, తన రూపం నిరూపించేవాడు. తన్నిగురించే ఓ అమరభావనల్లో విహరించేవాడు.

"ఆ దేవకన్యత్వం నా కొద్దు. నన్ను ఇల్లా

ఈ సంసారంలోనే వుండనియ్యండి. ఈ ప్రతీవాడు చదివేట్లు, చూడాలన్నట్టు, నా కక్కరలేదు.

"ఏం రాణీ! ఆ పోకడలన్నీ విషలిప్తమా!"

"ఔను..."

"అది కాదు సుందరీ! జీవితంలో ఆ మార్గం కూడా అలవర్చుకోవడంలో తప్పేముంది. నేను ఆరాధించే మార్గం అది."

సుందరికి ఆ మాట భయంకల్పించింది. తను వూహించుకున్న నిర్ణయమార్గాల్లోకి తన రాజా రాడు. "నేను ఆరాధించేమార్గం అది" ఆ వాక్యం ఎన్నోసార్లు జ్ఞాపకంవచ్చింది. తనకంటె ఆ కవితాదేవినే ఆరాధిస్తున్నాడు. ఆతన్ని మార్చడం ఎల్లాగా!

'సుందరీ! ఆ మార్గంలో ఏం తప్పుంది. స్వతంత్రంగా జీవించలేమా అందులో! నా భావాలు, ఆశలు, అన్నీ, నావే అయినప్పుడు, అంతకంటె స్వతంత్ర జీవనం ఏముంది. దానివల్ల మన సంసారసుఖం ఏ విధంగా అడ్డుతుంది?"

అదీ ఓ జీవనమేనా?

"ఏం? ఎందుకు కాదు. జీవించడానికి డబ్బు కావాలి. దానిని సంపాదించుటకు ఆ మార్గంలో అడ్డేముంది? దానితోనే సంపాదిస్తా!"

"కాని ఆ కంపెనీలో మీకు ఇంతకంటె ఎక్కువజీతం ఇస్తామన్నారుగా. అదెందుకు ఒప్పుకో కూడదూ?"

"అహా? నాకు ప్రెస్సు ఒకటి కొనుక్కోవాలని వుంది. అదే వుంటేనా!"

"అప్పుడు నాకు మరింతదూరం అయిపోడానికా"

"అయితే మాత్రం రాణీ, నువ్వు నాకు మరింత దగ్గరగా వుంటావుకా". అతను వెళ్లిపోయేడు.

ఇందులోని వేదాంతం అర్థంకాలేదు. తనకంటె రాజాకి అతనిపత్రికాజగత్తే ఎక్కువనిదుఃఖంవచ్చింది. ఈ ఆరాటనను ఒకళ్లకు చెప్పుకునైనా అనునయం పొందుదామన్నా తనఅత్తగారు తన వైపు మాట్లాడదు. ఆ వయస్సులో మూగగా పుస్తకాల్లో కాలం గడుపుకోవడంతప్ప ఇంకేమీ లేనేలేదు. ఆ మూగతనం తనకి మర్మ భేద్యంకాని సమస్యగానే వుంది.

ఆ రాత్రి విపరీతమైన బాధ పడింది ఆ ఇంట్లో తల్లీ కొడుకు ఒకటిగాను, తనోవిధంగాను ఉన్నట్లే తట్టింది. ఓ ఉద్యోగంచేస్తూ, బంధ్రోతులు, హోదా ఉన్నంత గొప్పగా ఈ పత్రికా ప్రపంచకంలో ఎక్కడ వుంటుంది? అది ఆశించడంకూడా పిచ్చిగానే వుంది. భావి?

* * *

ఆ మర్నాడు రాజా వస్తూనే "ఇవ్వాళ నా స్నేహితుడు వస్తున్నాడు. అతడూ కవే. ఆతని పేరు వినేవుంటావ్" అన్నాడు. అందులో అతని కళ్లు, శరీరం, పొంగిపోయింది. ఆనందంలో ఊగులాడుతున్నట్లే చెప్పేడు.

"అతనూ కవే!" ఆ వాక్యం మాత్రం ముళ్లతో గుచ్చినట్టే అయ్యింది. తను ఎంత గృహిణీత్వం వహిద్దామన్నా, ఆ శబ్దం అంటేనే మనస్సు, శరీరం, కూడా ద్వేషించేట్లు చేస్తోంది. ఈ నాడు అతని మర్యాద అంతకూడా చెయ్యలేనేమో అని తట్టింది. ఈ జోగిగాళ్లకు తనెందుకు చాకిరీచెయ్యాలి?

"అతను స్వతంతంగా పత్రిక పెడుతాడట. నన్ను కూడా రమ్మంటున్నాడు"

"పత్రికా! దానికి సంపాదకుడుగానా!"

"ఔను"

"మరి మీ స్వతంత్రతం అన్నారే! ఇదీ ఊడిగం అవటం లేదూ". తను ఎంత ద్వేషంలో అనాలో అంత గానూ అంది. ఎల్లాగైనా ఆ పంథాలోకి రాజాని దిగనివ్వకూడదన్న భావమే మెట్లు ఎక్కుతోంది.

నవ్వేడు. "ఊడిగమా! వ్యక్తిగతస్వాతంత్ర్యం ఉన్నంతవరకూ ఊడిగం అవదేమో!" మళ్ళీ ఆ వేదాంతమే!

ఆ రాత్రి వాళ్ళిద్దరూ ఘంటలతరబడి మాట్లాడేరు. తను వింది. అన్నిఘంటల్లోనూ, రచనలు,

టెక్నిక్, సర్రియలిజం, క్లైమాక్స్, బేలన్స్, కేరక్టరు, వగైరాలనుగురించే మాట్లాడేరు. అవి వింటున్నంత సేపూ తనకి క్వైనైన్ మాత్రలు మింగినట్టే వుంది. భరించలేని కోపం వచ్చింది. ఎంతగా, స్త్రీ అయి పుట్టినందుకు, తను, బానిసఅయ్యిందో, అన్న ద్వేషం కల్గింది.

ఆ మర్నాడు అతడు వెళ్ళిపోయేడు. "సుందరీ! ఓనాడు పత్రికాప్రపంచకంలో ఉన్నత స్థానం ఆక్రమించేవాడిలో అతను ఒకడు. అతను విషాదాంతాలు మనస్సు..." ఆయన చెప్పేడు.

"నేను వినదలుచుకోలేదండి" విసురుగానే వెళ్ళిపోయింది.

అతని నవ్వు వెనక వినపడుతోంది. అది తన్ని బంకులులో పెట్టినట్టే వుంది.

అతను తనవెనుకే వచ్చేడు. దగ్గరగా తీసుకుంటూనే—"నన్ను అర్థంచేసుకోలేకపోతున్నావ్"

"అర్థంచేసుకోలేం. మీకు నేనంటే ప్రేమే లేదు. మీకు మీ ఆ సారస్వతప్రపంచంతప్ప మరోటి లేదు. అందులో నేను లేను. దాన్నిగురించి ఆలోచిస్తూ సంసారాన్ని ఇల్లా చెయ్యడం బాగులేదు. పైగా మీ ఆశలు సఫలంఅవుటకు మనదగ్గఱ డబ్బు లేదు..." ఉద్వేగంలోనే అంది.

"అవును. నాకు డబ్బులేదు." నెమ్మదిగానే చేతులు విదిలించుకున్నాడు. అందులో నిరాశ, ఆశల, మధ్య నలుగుతున్న భావన తట్టింది. హృదయాంతరాల్లో విధితో పోరాడి ఓటమిపుచ్చుకున్నట్లు మొఖం బాధ పడింది. అతన్ని ఆ సితిలో చూడలేకపోయింది. తన రాజా, తను ద్వేషంలో, ఈర్ష్యలో, అన్న ముక్కలతో బాధపడ్డం, తను చూడలేదు. అతను తను ఆరాధించే వ్యక్తే. దుఃఖం వచ్చింది.

"రాజా !"

కళ్ళు బాధతో మూచేయి...

"రాజా!" అతని ఒడిలో వాలిపోయింది. మాటల్తో చెప్పలేని అనునయం, హృదయస్పందనతోనే చెప్పింది. కాని అతని కౌగిలింతలోతన పూర్వపు మధురస్మృతి కన్పించలేదు. నెమ్మదిగా దూరంఅవుతున్న అతన్ని చూస్తుంటే ఏడ్పు వచ్చింది. కళ్ళమ్మట నీళ్ళు చిమ్మేయి.

క్రిందకు దిగింది. అత్తగారు సావిట్లో కూర్చుని రాట్నం తీస్తోంది. ఆవిడని చూస్తుంటే "అత్తగారూ! మామగారు ఈ జీవనంకు జీవితాన్ని ధారపోసి, బాధలో, బీదతనంలోనే చచ్చిపోయేరు. ఈనాడు రాజాకుకూడా ఆ మార్గమే ఉత్తమమైనదని ఎందుకు ప్రోత్సహిస్తారు. అతనిజీవితానికి ఉరిత్రాడు తగిలిస్తున్నారని మీకు తెలియటంలేదా? మీ హృదయంలో ప్రేమ, వాత్సల్యం చచ్చిపోయేయా!" అని అడగాలన్నంత ఉద్వేగం కల్గింది.

నెమ్మదిగానే దగ్గరగా వస్తూనే "అత్తగారూ! వారు ప్రెస్ కొందామనుకుంటున్నారు. మీకు ఇష్టమేనా?" అంది.

"ఔనమ్మా!"

"మామగారు అంతగా...ఇప్పుడుకూడా?" ఆవిడ తలెత్తి చూచింది. ఆ చూపులో మార్పు లేదు. కొంచెమైనా భావం స్ఫురించని చూపే ఉండిపోయింది.

"ఆయన కొన్నివత్సరాలు వసంతకాలాన్ని చూచేరు." అంది.

అంతకంటే ఏమీ మాట్లాడనేలేదు. ఆవిడ తను నూలు తియ్యడంలో మునిగిపోయింది. ఎదురుగా అలమారుల్లో ఉన్న పుస్తకాలు, గూళ్ళల్లో ఉన్న పుస్తకాలు, ఎదురుగా నవ్వుతున్నట్లే వున్నాయి. తను నుంచోలేదు. ఈ గృహంలోనే స్థలంలేనట్టు వుంది. తల్లీ, కొడుకూ, ఇద్దరూకూడా అర్థంకాని వ్యక్తులై పోతున్నారు.

తన గదిలోకి వెళ్లింది. మనసారగా ఈ ఆరాటన ఉపశమించడానికే ఏడ్చింది. తనకే నమ్మకం కల్గటం లేదు. రోజూ పూజలు, ఉపోషాలు నైవేద్యాలు పుచ్చుకుంటున్న దేవుడు వున్నాడా అని.

* * *

ఎంతసేపు నిద్రపోయిందో సుందరికే తెలియ లేదు. క్రింద అత్తగారి, రాజామాటలు వినపడుతుంటే ఖంగారుగానే లేచింది. ఆ నిద్రలో "ఇంతకీ రాజాకి డబ్బులేదు. తనే ఉత్తినే ఊహలు కల్పించుకుని బాధ పడుతోంది" అనుకుంది. తను ఎంత మూర్ఖురాలిగా ప్రవ ర్తిస్తోందో తట్టింది. క్రిందకు దిగింది. తల్లీకొడుకు లిరువురుకూడా సంతోషంలోనే మునిగితేచినట్టే స్ఫురిస్తే తనే తెల్లబోయింది. అంత ఆనందంగా వుండుటకు కలిగిన పరిస్థితులు తను ఆలోచిద్దామన్నా దొరకటం లేదు.

"సుందరీ! ఎన్నాళ్లు ఇల్లా వుంటాను. నా ఆశలు సఫలం అవ్వాలి. ఈనాడు అప్పు అడుగుదామన్నా నాస్థితి చూచి ఇచ్చేవారు లేరు. అమ్మదామన్నా నాకు ఆస్తి లేదు. ఒక్కటే తట్టుతోంది. ఉమాపతి మామయ్య ఉన్నాడు. ఆయనకు సారస్వతం అంటే ఇష్టం. ఆయన నాకేమైనా చేబదులుగా ఇస్తాడేమో? దాంతో నేను నా పత్రిక నా స్వంత ప్రెస్‌లో ప్రారంభించ గలుగుతాను"

"ఉమాపతిమామయ్యా?" ఆత నెవరో తెలిసింది కాదు.

"ఉమాపతి నా తమ్ముడు. పక్షవాతం వచ్చింది. ఇప్పుడు రేపల్లెలో ఉన్నాడు" అంది అత్తగారు.

పక్షవాతం వచ్చిందా! ఈ తిండీ, నిద్ర మర్చిపోయి. ఆలోచనల్తో, ఆరోగ్యం చెడగొట్టుకుని సారస్వతంకొరకు పక్షవాతం తెప్పించుకున్నాడా? తనకి భయం కల్గింది. అడుగుదా మనుకుంది.

"అదొక్కటే మార్గం. నా ప్రయత్నాల్లో ఆఖరుది కూడాను. మామయ్య సహాయం చెయ్యకపోతే..." నుదురు తుడుచుకుంటూనే, "చెయ్యడు అని అనుకోలేను. తప్పక చేస్తాడు" అన్నాడు.

"ఆయన చేస్తారా?"

"చేస్తాడు. ఆతనంతా ఓ చిత్రమైన మనిషి. నేవ్రాసే ఉత్తరం మంచి మూడ్సులో ఉన్నపుడు అందితే..."

కాఫీ త్రాగినతర్వాతనే రాజా ఉత్తరం వ్రాసేడు. ఆ వ్రాస్తున్నంతకాలం, రాజాలో ఉన్న ఆతృత, ఆశ, స్వయంసిద్ధీ, అన్నీకూడా ఉలకేయి. ఆనందం, సంతోషం కళ్లల్లో మెరిసేయి. ఆ సాయంకాలమే టపాలో వేసివచ్చేడు.

సుందరినిమాత్రం ఈ చర్య స్తబ్దతపరచింది. హృదయంలో క్షోభ, ఆందోళన, భయం కమ్ముకున్నాయి. రాజా మొగంలోకి ధైర్యంగా చూచేశక్తి కూడా పోతోంది.

చిలక్కొయ్యను ఖండునా వేస్తూనే "పిచ్చి వూహాలు పెట్టుకుని ఎందుకు బాధపడతావ్. వాట్లని తరిమెయ్యాలి. జీవితాన్ని ఈ పరిస్థితుల్లో అల్లా మలుచుకోవడంలో ఉంది గొప్పతనం"అన్నాడు.

జీవితాలు, పరిస్థితులు, మలుచుకోవడం, ఏమిటి ఈముక్కలు, అర్థంకాకుండా మాట్లాడ్డమే జబ్బు అనుకుంది. తన తలంపులన్నీకూడా మూర్ఖమైనవి, అధారం లేనివి, భయంతో వున్నవి, అని రాజా ఎందుకు అంటాడో, తెలిసింది కాదు.

అ జరిగిన రోజుల్లో పోస్టుబంట్రోతు ఉత్తరం తెస్తాడేమో అన్న ఆందోళన, ఆశతోనే రాజా గడిపేడు. అలసివచ్చిన సాయంకాలంలో "ఇవ్వాళ ఉత్తరం వచ్చిందా?" అని అడిగేవాడు. "రేపు వస్తుందేమో" అనేది అత్తగారు.

నాలుగురోజులు గడిచేయి. అన్ని రోజుల్లో ఆ మధ్యాహ్నం ఉత్తరాలు అందుకునేందుకు సుందరే వెళ్లింది. ఆరోజుల్లో "ఇవ్వాళేమీ లేవండి" అంటంతో ఓ విధమైన భారం తగ్గినట్లే వుండేది.

ఐదోరోజు, యాదాలాపంగానే ఆ రెండు గంటలకు వెళ్లింది. "అమ్మా, టపా" అంటూనే ఉత్తరం చేతిలో పెట్టేడు. తన చెయ్యి వణికింది. అందుపైనున్న ముద్ర చూచింది. 'రేపల్లె'. ఉమాపతిగారు వ్రాసిందే. పిరికితనంలో ఇంట్లోకి చూచింది, ఎవ్వరూ కన్పించనేలేదు. ఓ విధమైన ధైర్యం వచ్చింది. ఉత్తరం రాజా పేరులో వున్నా చింపింది. మడతలు విప్పుతుంటేనే గుండెలు కొట్టుకున్నాయ్.

"రాజా! నా ఆరోగ్యం సరిగ్గా వుంటంలేదు. నువ్వు. అడిగిన డబ్బు ఇవ్వడానికి అభ్యంతరం లేదు. మీ తండ్రి పోకడలే నీలో వున్నందుకు చాలా సంతోషిస్తున్నా. ఒక్కసారి నాదగ్గరకి రా!" అని వుంది ఈ ప్రపంచం తన కళ్ళల్లో, ఆశల్లో తల్లక్రిందులే అయ్యింది. తను భరించుకోలేని కోపం వచ్చింది. ఈ పక్షవాతం మామయ్య ఎవడు, తన్ని తన రాజానుండి దూరం చెయ్యడానికి, అన్న కోపంలోనే, ఉత్తరాన్ని చించింది. ప్రతి చిన్నముక్కనీ నలిపేసింది. మూసంగా దూరంగానే గోడవతల పారేసి ఇంట్లోకి వచ్చింది. అందులో శాంతి వచ్చినట్లే తట్టింది. తన రాజా పునః మామయ్యకు ఉత్తరం, స్వాభిమానంలో, వ్రాయడని తెలుసు. ఇప్పుడు తను భద్రతగానే ఉండినట్టు తట్టింది. ప్రక్కగదిలోనుండి అత్తగారువచ్చి "ఉత్తరా లేమైనా వచ్చేయా?" అడిగింది.

"లేవు". ఆ సమధానం ఇచ్చేటప్పుడు సుందరికి మాటలు ఒణికేయి. గబగబా అడుగులు వేస్తూనే మెట్లు ఎక్కింది. సాయంకాలం రాజా వస్తాడు. ఆ కళ్ళల్లోంచే అడుగుతాడు. ఇన్నాళ్లు ఓభయంతో వేగిపోయింది. ఇప్పుడు దానికి తను ఎందుకు తలొగ్గాలో కూడా తట్టలేదు.

అనుకున్నట్లే రాజా అడిగేడు. 'రాలేదు' అనే తలూపింది. ఒక్కసారిగా అతను క్రుంగిపోయేడు. తన అబద్ధం కృతఘ్నత ఏవిధంగా కన్పడిపోతుందోనన్న అందోళనలోనే సుందరి నిరుకుగా చూడలేకపోయింది.

అ సాయంకాలమే వరండాలో కూర్చొని "సుందరీ! ఉత్తరం ఏందుకు రాలేదు! ఇప్పుడు రాదు అన్నట్లే అయితే భావి ఎల్లాగా అన్నదే సమస్యగా వుంది" అని కిటికీ పూచలవైపు చూస్తునే అన్నాడు.

దగ్గరసానే వెల్లిది. అందులో అతని అశాంతి, తన్ని నుంచోడానికి కూడా హక్కు లేనట్లే చేసింది. అతని భార్య తను. అతని ప్రేయసే, ఆరాధింపబడే దేవకన్య-కాని ఇప్పుడో ఓ కృతఘ్నరాలు, దగాకోరు, అబద్ధాలపుట్ట అన్న భావన హృదయాన్ని పిండింది. కాని తనేం చెయ్యాలో తెలియలేదు. తన ఆత్మకి

అతను జీవితంలో అర్ధాకలితో, బీదతనంలో ప్రపంచకంలో వేగిపోతూ, అశాంతుణ్ణిగా చెయ్యడం, తప్పించేనకదా తృప్తిపడు, అని చెపుదామన్నా, అది ఆగటంలేదు.

ఆరోజుల్లో చూచింది. రాజా అన్నమే తినడం మానేసేడు. సమస్యల్తో వేగిపోయి ఎముకలప్రోగే అయ్యేడు. అత్తగారూ ఆ ముభావంలోనే క్రుంగిపోయింది. అందులో ఇద్దరి ఆశల్లోని కలలు, నెమ్మది నెమ్మదిగా రక్తంచిదిమి మంగళహారతు లిస్తున్నట్లే తట్టింది. తను చూడలేకపోతూ నేవుంది. తనకే చోటు లేనట్లే వుంది. ఆ రోజులు చూడలేకనే తమ్ముడికి ఉత్తరం వ్రాసింది. "తన్నొకసారి పుట్టింటికి తీసుకు వెళ్ళమని"

ఆ ఆదివారం తమ్ముడువచ్చేడు. కొన్నాళ్లైనా దూరంగా వుంటే తన ఆరాటన శాంతికల్గుతుందనుకునే బండి ఎక్కింది. ఆ శబ్దాల్లో తన రాజాహృదయం గగ్గోలుపెట్టినట్లే తట్టింది. తనెవరు? ఏం చేసింది? ఏం పొందగల్గింది? ఇదేనా గృహిణికి అర్ధం? ఎన్నో ప్రశ్నలు వచ్చేయి. భరించుకోలేనట్లే...

"తమ్ముడూ! రేపల్లె వెళదాం పద" అంది. అందులో ఉమాపతిమామయ్యను ఓసారి చూస్తే. అతనితో తన హృదయం చెప్పుకోగలనేమో అనిపించింది. తను పుట్టింటికి వెళ్లి రాజాకి తను చేసిన అపచారం అంతా వ్రాద్దామనుకున్న భావన నిలవటంలేదు. అది చెయ్యలేదుకూడాను.

రేపల్లెలో ఉమాపతిగారి ఇల్లు తెలుసుకోవడంలో ఏం అంత కష్టపడలేదు. తమ్ముడికి అంతా ఆశ్చర్యంగానే వుంది. అక్క ప్రవర్తన అసలు అర్ధం కానే కావటంలేదు. మతేమైనా కాస్త చెడిందేమో అనుకున్నాడు.

లోపలికి వెళ్లింది. సావిట్లో మూలగా ఆయన మంచం కన్పించింది. దిండ్లు ఎత్తుగా పెట్టబడి ఆయన కూర్చున్నాడు. 'ఎవరో', అన్నట్టు చూపులు ఉండిపోయేయి.

సుందరి అడుగులు వేస్తూనే "నే నూ మీ మేనల్లుడి..."

"రాజా పెళ్లానివా! ఎందుకు వచ్చేవు? వాడు పంపేడా? వాడి జీవితానికి ఓ ఆధరవు ఏర్పరచివెళ్దాం అనుకునే ప్రెస్సుకు డబ్బు ఇస్తానన్నా. కనీసం కృతజ్ఞతలోనైనా ఉత్తరం వ్రాయలేకపోయేడు. ఇన్నాళ్లనుండి ఆశ పెట్టుకునీ ఉన్నానే, కాస్త ఉత్తరం వ్రాయకూడదూ. పోనీ తనవుద్దేశ్యం మార్చుకున్నాననైనా తెలియపరచక్కర్లేదూ?" ఆయన కోపంలోనే అన్నాడు.

"లేదండీ! మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు".

"తప్పుఅర్థాలా! నీకేమైనా... వెళ్లు... ఇక్కడకు ఎందుకు వచ్చేవు?".

"వినండి... కోపపడ్డా, దానికి నేనే బాధ్యురాల్ని. ఆ వుత్తరం నేనే చింపేశేను. రాజా కాని, అత్తగారుకాని చూడలేదు".

"ఏమిటి?"

"నిజమేనండి. నేనే చింపేసేను. అది నా స్వార్థమే కావచ్చు. అతను సారస్వతప్రపంచంలోకి వెళ్లడం నాకిష్టంలేదు. అందులో కొట్టుకుంటూ, తిండీ, బట్టాకూడా కరువై ఈగల్లా మాడిపోవడం నాకు ఇష్టంలేదు." సుందరికి ఏడ్పు వచ్చింది. ఆయన కళ్లల్లోకి చూస్తూనే ఇదేనా నీ త్యాగం. నీ భర్తను ప్రేమిస్తున్నానంటావా? ఇదే నీ ప్రేమ అన్నమాట."

'కాదా' అందామనుకుంది. కాని అది గొంతులోనే కొట్లాడింది.

"నీలాంటి పెళ్లాలుంటే మనుష్యులు......" ఆయన పూర్తిచేయకుండానే "అందుకే, నేను నా పుట్టింటికి వెళ్లిపోతున్నా, అతన్ని చూడలేకనే"

"వెళ్లి ఏం చెయ్యగలవ్! ఎంత తప్పుపనిచేసేవో అర్థం అయ్యిందా."

సుందరి మాట్లాడలేకనే మూగపోయింది. తన స్థితి, న్యూనత, ఆందోళన అన్నీకూడా ఎదురుగా ఆయనమాటల్తో చస్తున్నాయ్.

"రాజారక్తంలో అతని తండ్రి ఉన్నాడని మర్చిపోయేవా! మా బావ ఆ రోజుల్లో ఎంతగా ప్రతీఇంట్లో చెప్పుకునేవాడయ్యేడో నీ కేం తెలుసు. అతను బీదరికంలో బ్రతికేడని, కష్టాలు పడలేక సంసారాన్ని కాల్చేడని, ఆస్తీపాస్తీ తగలబెట్టేడని ఎవరు చెప్పేరు. ఈ ఊహాలన్నీనీ కుంచితభావాల ఫలితం కాని ఇంకేమిటి?"

తను వ్రాసుకున్న రామాయణంకు టీక చెప్పినట్టే వుంది.

"రాజా ఆ ఆశలోనే, గొప్పవాడు ఎందుకు కాలేడో నువ్వు చెప్పగలవా? వెళ్లు. రాజాని రమ్మని చెప్పు".

"ఈ స్థితిలో వెళ్లితే, నన్ను..."

"పిచ్చిపిల్లా! ఆదరించుతాడా అంటావా? ఆ ప్రేమ వుంటుందా అనుకుంటావా? కవిహృదయంలో ప్రేయసికి వున్నస్థానం ఇంకెవరికీకూడా ఉండదు. ఆ స్థితి పొందుటకు నువ్వు ఎంత పుణ్యం చేసుకున్నావో"

సుందరి ఆ పూటకూడా అక్కడ వుండకుండానే తమ్ముడితో బయల్దేరింది. ఈఅర్థం కాని సంగతుల్లో తమ్ముడు ఏమైనా ఓ నిర్ణయం చేసుకోగలనేమో అని ఆలోచించేడు. అది దొరకటంలేదు. స్టేషన్కు వచ్చినపుడే "అక్కాయ్ మనవూరికే టిక్కెట్టు కొననా?" అడిగేడు.

"వద్దు, నా ఇంటికి వెళ్లిపోతా. మరోసారి వస్తా" అంది. తమ్ముడుకి అమ్మ అడిగితే ఈ సంచారాల్కి ఏమి అర్థంచెప్పాలో తెలియక తికమకపడ్డాడు.

తనింటికి వచ్చేటప్పుడే ఆ ఇల్లు చూస్తుంటే- తను జీవితంలో ప్రేమ, ఆరాధన ఆ ఇంట్లోనే నేర్చుకుంది. సంసారంలోని సుఖం, మాధుర్యం రుచిమూసింది. ఇప్పుడో అవన్నీ స్వార్థంలోనే మర్చిపోయి వదిలిపెట్టింది. తన హృదయమే తిరగపడింది. తన శరీరం ఇప్పుడు ప్రతీకణం, ప్రతీభాగం ఎలుగెత్తి తనభరోసాతనాన్ని తిడుతోంది. ఎత్తి చూపిస్తోంది. ఏ మవుతుంది? ఎల్లా పరిణామాల్లో తను కట్టబడుతుంది?

తలుపు తోసింది. అత్తగారు పత్రికలోనుండే తలెత్తింది. అందులో ఆశ్చర్యం కొంచెం పొడచూపింది.

"ఆయన ఏరీ!"

"రాజావా! తిరుగుతున్నాడు. దుఃఖం భరించుకోలేకనే ఇల్లు మర్చిపోయేడు" అంది.

తనేం చెయ్యాలి. సుందరికి శరీరంలో నవనాడులు క్రుంగిపోయేయి.

"అప్పుడే వచ్చేసేవేం?"

"ఆయన్ని క్షమాపణ అడగడానికి ఉమాపతి బాబుగారింటికి వెళ్ళే. ఆయన ఈ రోజుకే ఎదురు చూస్తునేవున్నారు, రాజా వస్తాడని"—ఇక మాట్లాడలేకనే కుర్చీలో కూలబడింది.

ఆవిడ దగ్గరగానే వచ్చింది. భుజంమీద చెయ్యి వేస్తూనే "నాకు తెలుసు. నేను ఆరోజు కిటికీలోనుండే చూచే. నువ్వు ఉత్తరం చింపేవు. ఆ గోడవరకూ కూడా వెళ్ళేవు. చింపిన ముక్కలు పారెయ్యడానికి...

ఉలిక్కిపడే భయంలో తలెత్తి "రాజాతో మీరు చెప్పేరా?" అడిగింది సుందరి.

నవ్వింది. "పిచ్చిపిల్లా. భార్యాభర్తలు వారి సమస్యల్ని వారే చర్చించుకోవాలి. నిర్ణయానికి రావాలి. ఒకళ్లు పెద్దనమ్మ అంటూ కలగచేసుకోవడమంత తెలివితక్కువలేదు. నువ్వు ఓ రోజు కాకపోతే ఇంకోరోజైన రాజాతో నిజం చెపుతావనుకున్నాను. ఇన్నాళ్లూ వాడికి ఎంత క్షోభ కలుగచేసేవో నువ్వు చూడలేకపోయేవు. పైగా నేను భార్యమీద నేరాలు చెప్పి విడతీసేంత మూర్ఖురాల్ని కాను" అంది.

సుందరికి అత్తగారంటే కొంచెం అర్థమైయ్యిందేమో! చెయ్యెత్తి నమస్కరించింది.

"రాజాకి వాళ్ల తండ్రిపోలికలూ, పట్టుదలావుంది. వాడి భావిలో వాడి ఆదర్శం పొందగలదన్న ధైర్యం వుంది. ఓనాటికైనా మీరిద్దరూ కలుస్తారని, జంటగానే మీ సమస్యల్ని పరిష్కరించుకుంటారన్న ధైర్యం వుంది."

కళ్లమ్మట నీళ్లు తిరిగేయి. అత్తగారు అనుభవం అంతా మూర్తీభవించే చెప్పింది. తన్నో, ఈ స్థితిలో రాజా నమ్ముతాడా? తను పతనం చెందింది. ఇందులో నరకం అనుభవించి, ఆ స్వర్గానికి ఎగుస్తోంది. అది అందుతుందా?

"అత్తగారూ! మీ విశాలహృదయం నాకు లేకపోయింది. కాని ఇప్పుడు రాజా నన్ను నమ్ముతాడా?"

"సుందరీ! వెళ్లు. వాడితో మాట్లాడు. వాడింకా నువ్వంటే ఆరాధిస్తున్నాడు"

గుమ్మంమీద చెప్పులచప్పుడు వినపడ్డాయి. ఆ అడుగులు రాజావే! సుందరికి భయంవేసింది. ధైర్యం చాలటంలేదు. "అత్తగారూ! మీ రుండండి" ఆవిడ చెయ్యిపట్టుకుంది.

నవ్వుతూనే "భార్యాభర్తల తగువు అది. నేనెందుకూ" అంటూనే వెళ్ళింది. రాజాతో చెప్పింది. అతని ఆశ్చర్యపుశబ్దం తను వింది. "స్త్రీకి జాలి అనునయం కావాలి. ఆమె ఏదిచేసినా నీయెడ వుండే ప్రేమచేతనే" అని అతనితో అన్న ముక్కలుకూడా వినపడ్డాయి.

రాజాని చూసింది. ధైర్యం చాలటంలేదు. ఆ రెండుదినాల్లోపలా ఎంతగా మారిపోయేడో అని ఆవేదన పడింది. కళ్లనీళ్లు కమ్మేయి. మాట్లాడలేకపోయింది. అతనే దగ్గరగావచ్చి చేతుల్లోకి తీసుకున్నాడు. బావురుమని పోయింది.

"నిజంగానే రాజా! నిన్ను నేను పిరికితనంలో స్వార్థంలో, కుత్సితంలోనే ప్రేమించేను. కాని ఈనాడు నేను దాన్ని జయించగల్గేనేమో! నా స్వార్థాన్ని పిరికితనాన్ని..."

"రాణీ! అవన్నీ మర్చిపో! నువ్వు వచ్చేవు. అంతే చాలు." హృదయాన్కి హత్తుకున్నాడు. కరిగిపోయే అతనితో చెప్పింది.

"రేపే వెళదాం రాజా!"

"పిచ్చి!" అతను నవ్వేడు. అందులో తను నాగకన్య అయ్యిందేమో! అమరత్వం చూచిందేమో! కరగేపోయింది సుందరి. ఈ ప్రపంచకమే లేదు.